రారండోయ్ ఓటేద్దాం..

- నేడే లోక్‌సభ ఎన్నికల సమరం
- పోలింగ్ కేంద్రాలకు తరలిన ఎన్నికల సామగ్రి
- అడుగడుగునా పటిష్ట బందోబస్తు



ఓట్లు వేయడానికి సొంత ఊర్లకు వెళ్తున్న ప్రజలు

చార్మినార్: హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం పోలింగ్ కోసం పాతబస్తీలోని అన్ని ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలు సిద్ధమయ్యాయి. ఆదివారం సాయంత్రానికి ఆయా డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, కౌంటింగ్ (డీఆర్సీ)ల నుంచి ఈవీఎం, వీవీ ప్యాట్‌లు సంబంధిత పోలింగ్ స్టేషన్లకు ఆర్టీసీ బస్సుల ద్వారా గట్టి బందోబస్తు మధ్య తరలించారు. చార్మినార్, యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట, బహదూర్‌పురా తదితర నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు చేరుకున్నాయి. ఆయా పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది కూడా చేరుకొని ఈనెల 13న జరగనున్న పోలింగ్ కోసం ఏర్పాట్లను పర్యవేక్షించారు. పోలింగ్ బూత్‌ల వద్ద ఇప్పటికే గట్టి బందోబస్తు కొనసాగుతోంది. ఈ నెల 13న జరగనున్న పోలింగ్‌కు ప్రొసిడింగ్ అధికారులు, సహాయ ప్రొసిడింగ్ అధికారులు, బూత్ లెవల్ అధికారులు, పోలీసులు సిద్ధంగా ఉన్నారు.

పాతబస్తీ శాసనసభ నియోజక వర్గాల్లో ఓటర్లు..పోలింగ్ కేంద్రాలు..

చార్మినార్ శాసనసభ నియోజకవర్గంలో పురుష ఓటర్లు 1,20,108 కాగా, మహిళా ఓటర్లు 1,10,160, థర్డ్ జెండర్ 30 ఓటర్లతో కలిపి మొత్తం 2,30,298 ఓటర్లకు గాను 198 పోలింగ్ స్టేషన్లను సంబంధిత ఎన్నికల అధికారులు సిద్ధంగా చేశారు. అలాగే చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో 3,49,611 మంది ఓటర్లకు గాను 305 పోలింగ్ స్టేషన్లు, యాకుత్‌పురా నియోజకవర్గంలో 3,60,712 ఓటర్లకు గాను 332 పోలింగ్ స్టేషన్లు, బహదూర్‌పురా నియోజకవర్గంలో 3,21,904 ఓటర్లకు గాను 263 పోలింగ్ స్టేషన్లను సోమవారం జరగనున్న పోలింగ్‌కు సిద్ధం చేశారు.

2009 ఎన్నికల నుంచి 2024 ఎన్నికలకు పెరిగిన ఓటర్లు..

2009 పార్లమెంట్ ఎన్నికలలో పాతబస్తీలోని నాలుగు శాసన సభ నియోజకవర్గాల పరిధిలో ఉన్న ఓటర్ల సంఖ్యతో పోల్చితే..ఈసారి ఓటర్ల సంఖ్య అనూహ్యంగా పెరిగాయి. 2009లో చార్మినార్ శాసనసభ నియోజకవర్గంలోని 2,06,729 ఓటర్లకు గాను.. ప్రస్తుతం 2,30,298 ఓటర్లుగా..చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలోని 2,95,879 ఓటర్లకు గాను..ప్రస్తుతం 3,49,611 మంది ఓటర్లు, యాకుత్‌పురా నియోజకవర్గంలో 3,32,228 ఓటర్లకు గాను, 3,60,712 ఓటర్లు, బహదూర్‌పురా నియోజకవర్గంలో 2,66,016 ఓటర్లకు గాను..3,21,904 ఓటర్లుగా నమోదయ్యారు. ఇలా గత ఐదేళ్లలో వేల సంఖ్యలో కొత్తగా ఓటర్లు నమోదయ్యారు.

గోషామహల్ నియోజకవర్గంలో..

అబిడ్స్/సుల్తాన్‌బజార్: గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల ప్రక్రియకు భారీ ఎత్తున సన్నాహాలు చేపట్టారు. నియోజకవర్గంలోని 235 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం ఓటింగ్ ప్రక్రియను నిర్వహించేందుకు అధికారులు వేగవంతంగా ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు విక్టర్ విద్యాధర్, ప్రేమ్‌కుమార్ కోఠి ఉమెన్స్ కళాశాలలో ఉన్న డీఆర్సీ నుంచి ఎన్నికల సిబ్బందిని, ఈవీఎంలను, సామగ్రిని పోలింగ్ కేంద్రాలకు తరలించారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు ఉండే విధంగా అధికారులు ఏర్పాట్లు చేపట్టారు.

3 వేల మంది సిబ్బందితో ఏర్పాట్లు..

గోషామహల్ నియోజకవర్గంలోని 235 పోలింగ్ స్టేషన్లలో దాదాపు 3 వేల మంది సిబ్బందితో ఎన్నికల ప్రక్రియ చేపడుతున్నట్లు ఏఆర్ఓలు విక్టర్, విద్యాధర్, మన్య ప్రేమ్‌కుమార్ వివరించారు. సోమవారం ఉదయం 5.30 గంటలకు మాక్ పోలింగ్ నిర్వహించి ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమవుతుందన్నారు. సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందన్నారు. పోలింగ్ ముగిసిన అనంతరం ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరుస్తామని వివరించారు. నియోజకవర్గాన్ని 21 సెక్టార్లుగా విభజించి సెక్టార్ వైజ్‌గా 235 పోలింగ్ బూత్‌లకు పోలింగ్ సిబ్బంది, 587 ఈవీఎంలు, 292 సీయూలు, 329 వీవీ ప్యాడ్‌లను తరలించామన్నారు.

ఎన్నికలకు భారీ ఏర్పాట్లు..



గోషామహల్ డీఆర్సీని సందర్శించిన రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

అబిడ్స్ /సుల్తాన్‌బజార్: హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు వేగవంతంగా చేపడుతున్నట్లు హైదరాబాద్ పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని 7 సెగ్మెంట్లల్లో పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంల తరలింపు, సిబ్బంది తరలింపు, సామగ్రి తరలింపు చేపడుతున్నట్లు తెలిపారు. ఆదివారం కోఠి ఉమెన్స్ కళాశాలలో ఉన్న గోషామహల్ నియోజకవర్గం డీఆర్సీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గోషామహల్ నియోజకవర్గ ఏఆర్ఓలు విక్టర్, విద్యాధర్‌తో మాట్లాడి ఎన్నికల ప్రక్రియ వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పలు విధాల ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఎండను తట్టుకునేందుకు టెంట్లు, ఓటర్లకు మంచినీటి ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు.

సెల్‌ఫోన్ల అనుమతి లేదు..

పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్ల అనుమతి లేదని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఓటింగ్ శాతం పెరిగే విధంగా ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటింగ్ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ఓలు విక్టర్, విద్యాధర్, ఇతర సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

కార్వాన్ నియోజకవర్గంలో..

గోల్కొండ: నేడు జరగనున్న పార్లమెంట్ ఎన్నికల ఓటింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కార్వాన్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,88,000 కాగా నియోజకవర్గంలో మొత్తం 310 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆదివారం సాయంత్రానికి పోలింగ్ బూత్‌ల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. పోలింగ్ బూత్‌లకు వచ్చే వారి కోసం సౌకర్యాలు కూడా కల్పించడం జరిగింది. పురుషులు, మహిళలకు విడివిడిగా బూత్‌లు ఏర్పాటు చేయడం జరిగింది. వికలాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు కూడా జరిగాయి. టాయిలెట్స్ సౌకర్యాలు లేని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేకంగా మహిళలు, పురుషుల కోసం బయో టాయిలెట్స్ కూడా ఏర్పాటు చేశారు. ఓటింగ్ కేంద్రం ప్రాంగణంలో టెంట్లు కూడా వేశారు. తాగునీటి ఏర్పాట్లు కూడా ఏర్పాటు చేయడం జరిగింది. ఆదివారం మధ్యాహ్నం వరకు తమకు కేటాయించిన పోలింగ్ బూత్‌లకు అధికారులు చేరుకోవడం ప్రారంభించారు.



గోల్కొండలోని పోలింగ్ కేంద్రంలో బయో టాయిలెట్స్



చార్మినార్ డీఆర్సీలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏఆర్ఓ, జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న



పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలతో తరలుతున్న సిబ్బంది



చంచల్‌గూడ జూనియర్ కాలేజీలో కొనసాగుతున్న బందోబస్తు



గోషామహల్ నియోజకవర్గంలో పోలింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది



వివరాలు వెల్లడిస్తున్న ఏఆర్ఓలు విక్టర్, విద్యాధర్

ఘనంగా మదర్స్ డే

గోల్కొండ: మదర్స్ డే వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. గోల్కొండతో పాటు గుడిమల్కాపూర్ తదితర ప్రాంతాల్లో మాతృమూర్తులను ఘనంగా సన్మానించారు. గోల్కొండ రిసాలబజార్‌లో బి.శ్రీకాంత్‌చారి తదితరులు తమతమ తల్లులను సన్మానించి పాదాభివందనం చేసి వారి ఆశీర్వాదం పొందారు. అదే విధంగా గోల్కొండలో ప్రముఖ న్యాయవాది వాణిశ్రీ ఆధ్వర్యంలో మదర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి.



గోల్కొండ రిసాల బజార్‌లో..



మదర్స్ డే వేడుకల్లో న్యాయవాది వాణిశ్రీ తదితరులు

ఎక్కడి సమస్యలు అక్కడే..

- అక్కడక్కడా అభివృద్ధి.. అయినా వెంటాడుతున్న సమస్యలు
- ఏళ్ల తరబడి కలుషిత నీటి సరఫరా
- తాత్కాలిక మరమ్మతులతో విసిగిపోతున్న ప్రజలు

చార్మినార్: హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి పాతబస్తీలోని శాసనసభ నియోజకవర్గాలు గుండెకాయ లాంటివి. పార్లమెంట్ స్థానంలోని చార్మినార్, యాకుత్‌పురా, బహదూర్‌పురా, చాంద్రాయణగుట్ట, మలక్‌పేట్, కార్వాన్, గోషామహల్ తదితర శాసనసభ నియోజకవర్గాలున్నాయి. ఇందులో ప్రధాన నియోజకవర్గాలైన చార్మినార్, యాకుత్‌పురా, బహదూర్‌పురా, చాంద్రాయణగుట్ట, మలక్‌పేట్‌లు పాతబస్తీ పరిధిలోనే ఉన్నాయి. పాతబస్తీ శాసనసభ నియోజకవర్గాల్లో అక్కడక్కడ అభివృద్ధి పనులు జరిగినప్పటికీ..ఇంకా సమస్యలు స్థానికులను వెంటాడుతూనే ఉన్నాయి. ఈ సమస్యలే ప్రస్తుతం జరగనున్న పోలింగ్‌లో ఓటర్లను ప్రభావితం చేయనున్నాయి.

చార్మినార్ పెడస్ట్రియన్ ప్రాజెక్టు (సీపీపీ–చార్మినార్ కాలిబాట పథకం) పనులలో భాగంగా కేవలం గ్రానైట్ రోడ్డు పనులు మాత్రమే పూర్తయ్యాయి. ఏళ్ల తరబడి నత్తనడకన కొనసాగిన కాలిబాట పథకం పనుల్లో భాగంగా సుందరీకరణ పనులు ఇంకా జరగాల్సి ఉంది. చార్మినార్ ఔటర్ రింగ్ రోడ్డు, ఇన్నర్ రింగ్ రోడ్డులలో పూర్తి స్థాయిలో రోడ్ల విస్తరణ జరగకపోవడంతో వాహనదారులు సమస్యలను ఎదుర్కొంటున్నారు. పాతబస్తీలోని చాలా బస్తీలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. మినీ బస్సులను కొంతకాలం నడిపిన ఆర్టీసీ యజమాన్యం అనంతరం వాటిని రద్దు చేసింది.



రెయిన్‌బజార్‌లో కలుషిత నీరు సరఫరా (ఫైల్)



మౌలాకా చిల్లాలో ఇళ్లల్లోకి చేరిన వరద నీరు (ఫైల్)

పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో..

సరైన పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో వ్యాపారాలు కుంటుపడుతున్నాయి. నగరంలోని ఇతర ప్రాంతాల వినియోగదారులే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా వినియోగదారులు, చిరు వ్యాపారులు పాతబస్తీకి వచ్చి ప్రతిరోజు వ్యాపార లావాదేవిలను కొనసాగిస్తుంటారు. సరైన పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో తమ వాహనాలను ఎక్కడ పార్కింగ్ చేసుకోవాలో తెలియక ఇబ్బందులకు గురవుతున్నారు.

వెంటాడుతున్న కలుషిత నీటి సరఫరా..

పాతబస్తీలో కలుషిత నీటి సరఫరా సమస్య స్థానికులను ఇంకా వెంటాడుతోంది. కుళాయిల ద్వారా నీటి సరఫరా ప్రారంభమైన చాలా సేపటి వరకు నీరు కలుషితంగా వస్తుండడంతో పాతబస్తీ ప్రజలు తాగు నీటి కోసం పడరాని పాట్లు పడుతున్నారు. కొన్ని ప్రాంతాలలో డ్రైనేజీ పైప్‌లైన్లు..తాగునీటి పైప్‌లైన్లు కలిసి పోతుండడంతో కలుషితమైన నీటి సమస్య తలెత్తుతోంది. ఈ విషయం సంబంధిత జలమండలి అధికారులకు తెలిసినా.. తాత్కాలిక మరమ్మతులు చేసి వెళ్లిపోతున్నారని అంటున్నారు. యాకుత్‌పురాలోని రెయిన్‌బజార్, ఎస్సార్టీ కాలనీ, అజ్మత్ నగర్, ఇమాంబాడా తదితర ప్రాంతాల్లో నెలల తరబడి కుళాయిల ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతోంది. ఈ విషయం సంబంధిత జలమండలి అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా.. పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం

- గోల్కొండ, టోలిచౌకీలో ఎక్కడిచెత్త అక్కడే
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు



టోలిచౌకీ-ఎండిలైన్స్ రోడ్డు పక్కన చెత్త

గోల్కొండ: పార్లమెంట్ ఎన్నికల సాకుతో పారిశుద్ధ్య పనులను అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. చెత్తను తరలించకపోవడంతో చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. కార్వాన్, గోల్కొండ, టోలిచౌకీ డివిజన్లలో పది రోజుల నుంచి పారిశుద్ధ్య పనులు నామ్‌కే వాస్తేగా జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. వివిధ పార్టీల నాయకులు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. అయితే వారికి కూడళ్లు, ప్రధాన రహదారులపై చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. దీంతో ఆ పార్టీల నాయకులు అసహనానికి గురవుతున్నారు. కార్వాన్ నియోజకవర్గం పారిశుద్ధ్య అధికారిని చెత్త విషయమై అడిగితే ఆ ప్రాంతం బల్దియా వారు చూస్తున్నారా..ప్రైవేటు కంపెనీ చూస్తుందా అంటూ ఎదురు ప్రశ్నిస్తున్నారు. స్వయంగా అధికారికే కాంట్రాక్టు కంపెనీ పేరు తెలియకపోవడం విడ్డూరం. గోల్కొండ ఒవైసీ ప్లే గ్రౌండ్ ముందు చెత్త తరలించకపోవడంతో ప్లేగ్రౌండ్‌కు వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా శాతం చెరువు కట్టకు ఓ వైపు చెత్త కుప్పలు భారీగా పేరుకుపోతున్నాయి. వీటిని ఎప్పుడు తరలిస్తారో తెలియని పరిస్థితి నెలకొని ఉంది. గోల్కొండ పాత పోలీస్ క్వార్టర్స్ మధ్య ఎక్కడపడితే అక్కడ చెత్త దర్శనం ఇస్తుంది. మోతీదర్వాజా, టోలిచౌకీ, కార్వాన్ బాంజావాడి, గుడిమల్కాపూర్ మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో నడిరోడ్డుపైనే చెత్త వ్యర్థాలు డంపింగ్ చేసి ఉంటున్నాయి.



నదీమ్ కాలనీలో..

ఘనంగా శంకర్‌జీ జయంతి



శంకర్‌జీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వినయ్‌కుమార్ ముదిరాజ్, డాక్టర్ గంగాధర్, సురేందర్‌జీ, హన్మంతరావు

అబిడ్స్: ఎగ్జిబిషన్ సొసైటీ వ్యవస్థాపకుడు దివంగత శంకర్‌జీ 112వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఎగ్జిబిషన్ సమీపంలోని ఆయన విగ్రహానికి ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు వినయ్‌కుమార్ ముదిరాజ్, డాక్టర్ గంగాధర్, హన్మంతరావు, సురేందర్‌జీ, రాజేశ్వర్ ఇతర ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ విద్యారంగ అభివృద్ధికి, సమాజ అభ్యున్నతికి శంకర్‌జీ చేసిన సేవలు వారు కొనియాడారు.

ఉషా గాయత్రికి ఆత్మీయ సత్కారం



నాట్య గురువు డాక్టర్ మద్దాళి ఉషా గాయత్రి దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

నాంపల్లి: సాంస్కృతిక బంధు సారిపల్లి కొండలరావు ఆధ్వర్యంలో యువ కళావాహిని నిర్వహణలో ప్రముఖ కూచిపూడి నృత్య గురువు డాక్టర్ మద్దాళి ఉషా గాయత్రికి కేంద్ర సంగీత నాటక అకాడమి పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా ఆత్మీయ సత్కార సభ జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో నిర్వహించారు. సారిపల్లి కొండలరావు అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణ హాజయ్యారు. దూరదర్శన్ పూర్వ డైరెక్టర్ హైదరాబాద్ డాక్టర్ పాలకుర్తి మధుసూదనరావు హాజరై సభను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం, సినీ రచయిత డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ, కూచిపూడి నాట్య గురువు డాక్టర్ ఎస్.పి.భారతి, యువకళావాహిని అధ్యక్షులు లంక లక్ష్మీనారాయణ, కిన్నెర రఘురామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మద్దాళి ఉషా గాయత్రి దంపతులను సత్కరించారు. సభా ప్రారంభంలో డాక్టర్ మద్దాళి ఉషా గాయత్రి శిష్య బృందంచే ప్రదర్శించిన భజ గోవిందం సాంస్కృతిక కార్యక్రమం ఆకట్టుకుంది.

పర్యాటకుల సందడి



గోల్కొండ: గోల్కొండ కోట పర్యాటకులతో కిటకిటలాడింది. నగరంలోని వివిధ ప్రాంతాలతో పాటు పొరుగు జిల్లాల నుంచి కూడా పెద్ద ఎత్తున పర్యాటకులు కోటకు తరలివచ్చారు. పాఠశాలలకు సెలవులు కావడంతో తమ తమ పిల్లలతో పలు కుటుంబాలు కోటకు తరలివచ్చాయి. కోటలోని నగీనాబాగ్, క్లాపింగ్ పోర్టికో తదితర ప్రాంతాల వద్ద పిల్లలు సందడి చేస్తూ ఆటలు ఆడుకున్నారు. పలువురు యువ జంటలు క్లాపింగ్ పోర్టికో వద్ద గల భారీ ఫిరంగి వద్ద సెల్ఫీలు దిగారు. రామభక్తులు కోట ఎగువ భాగంలో గల భక్త రామదాసు బందీఖానాను సందర్శించి భక్త రామదాసు చరసాలను సందర్శించారు.

అన్నదానం



గోల్కొండ: నిరంతరాయంగా అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని ప్రభుత్వ బాలుర సెకండ్ లాన్సర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ బషీర్ అన్నారు. ఆదివారం ఆయన ఆధ్వర్యంలో పలు ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రముఖ ప్రభుత్వ ఆసుపత్రులైన ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి, సరోజినీదేవి కంటి ఆసుపత్రి, గోల్కొండ ఏరియా ఆసుపత్రులకు దూర ప్రాంతాల నుంచి నిరుపేదలు వైద్యం కోసం వస్తారన్నారు. వీరిలో చాలా మంది ఇన్‌పేషంటర్లుగా ఉండి చికిత్స పొందుతారని వారి వెంట వచ్చే సహాయకులకు ఉచితంగా భోజనం అందించేందుకు తాము కృషి చేస్తున్నామన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

సంతోష్‌నగర్: అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్న ఓ స్థావరంపై కంచన్‌బాగ్ పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఇద్దరిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..మిధాని సమీపంలోని గుడిసెల్లో నివాసముంటున్న కేతావత్ జ్యోతి (35), నేనావత్ తిరుపతి (30)లు గుట్టు చప్పుడు కాకుండా అక్రమంగా మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీనిపై విశ్వసనీయమైన సమాచారం అందుకున్న కంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు స్థావరంపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో జ్యోతి, తిరుపతిను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 31 బాటిళ్లు (ఓసీ–180ఎంఎల్), 46 బాటిళ్లు (ఓసీ–90ఎంఎల్), 25 బాటిళ్లు (కీకీ ఫైన్–180ఎంఎల్), 11 బాటిళ్లు (మ్యాడ్ డాల్స్–180ఎంఎల్), 30 బాటిళ్లు (ఇంపిరియల్ బ్లూ–180ఎంఎల్), 21 బాటిళ్లు (హైవార్డ్స్–5000–650ఎంఎల్)లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

క్రికెట్ ఆడిన ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

సాక్షి, సిటీబ్యూరో: పార్లమెంట్ ఎన్నిక ప్రచారంలో బిజీబిజీగా గడిపిన ఏఐఎంఐఎంఅధినేత, హైదరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ ఆదివారం శాస్త్రిపురంలోని తన ఇంటి వద్ద అక్కడి యువకులతో సరదాగా క్రికెట్ ఆడారు. బ్యాటింగ్ చేసి సిక్సర్లు కొట్టారు.